www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 5-5-2024

Tirupathi | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | తిరుపతి సిటీ

ఆరుగంటలు ఆలస్యంగా లండన్ విమానం

● ప్రయాణికుల అవస్థలు

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనాంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయానికి లండన్ నుంచి బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం ఆరుగంటలు ఆలస్యంగా రావటంతో 3 వందల మందికి పైగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. లండన్ విమానం ప్రతిరోజూ వేకువజాము 3.30 గంటలకు వచ్చి, మళ్ళీ వేకువజాము 5.35 గంటలకు లండన్ బయలుదేరి వెళ్తుంది. లండన్‌కు నేరుగా వెళ్లే విమానం కనుక ఆ విమానంలో ఎప్పుడూ ప్రయాణీకుల రద్దీ ఉంటుంది. శనివారం వేకువజాము 5.35 గంటలకు లండన్ విమానంలో వెళ్లేందుకు 314 మంది ప్రయాణికులు మీనంబాక్కం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. అయితే ఆ విమానం ఉదయం 9.30 గంటలకు వచ్చింది. ఆ విమానం ఆలస్యంగా వస్తుందని అధికారులు పదే పదే ప్రకటనలు చేసినా ప్రయాణికులు గంట లేదా రెండు గంటలు ఆలస్యంగా వస్తుందని భావించారు. అయితే గంటలు గడిచేకొద్దీ లండన్ విమానం రాకపోవడంతో ప్రయాణికులంతా ఎయిర్‌పోర్ట్ ఉన్నతాధికారులపై మండిపడ్డారు. చివరకు ఆరుగంటలు ఆలస్యంగా ఉదయం 9.30 గంటలకు వచ్చిన ఆ విమానం ఉదయం 11.40 గంటలకు లండన్‌కు బయలుదేరింది.

సముద్రతీర ప్రాంతాల్లో 'అల'జడి



● మినీ సునామీ దృశ్యాలు
● జాతీయ సముద్రసేవా సంస్థ హెచ్చరిక

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సముద్రతీర ప్రాంతాల్లో శనివారం అలలు ఎగసి పడ్డాయి, సోమవారం వేకువజాము వరకూ అలల తాకిడి తీవ్ర రూపంగా ఉంటుందని, మినీ సునామీని తలపించేలా రాక్షస అలలు విరుచుకుపడతాయని భారత జాతీయ సముద్ర సేవా సంస్థ హెచ్చరిక జారీ చేసింది. భూమి దక్షిణ ధ్రువంలోని అంటార్కిటికా ఖండానికి చేరువగా హిందూ మహా సముద్రంలో గత కొన్ని రోజులుగా పెనుగాలులు అధికంగా వీస్తున్నాయి. అత్యంత వేగంగా వెలువడుతున్న గాలులు వల్ల కడలిలలో అలలు ఎగసిపడుతున్నాయి. దీంతో ఏప్రిల్ 27న హిందూ మహాసముద్రంలో సుడిగాలులు తీవ్రరూపం దాల్చాయి. ఆ గాలులు ప్రస్తుతం కేరళ వైపు, రాష్ట్రం వైపు పయనిస్తున్నాయని, దీంతో శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని సముద్రతీర జిల్లాల్లో మినీ సునామీని తలపించేలా అలలు విరుచుకుపడతాయని ఆ సంస్థ హెచ్చరించింది. సముద్రతీరాల్లో అలలు సాధారణ స్థాయి కంటే అర మీటరు నుంచి రెండు మీటర్ల ఎత్తున విరుచుకుపడతాయని, సముద్రం ఉప్పొంగుతున్నట్లు కనిపిస్తుందని పేర్కొంది. ఈ అలలు ఊహించని సమయంలో తీరం దాటి ముందుకు దూసుకువచ్చే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు.

4 జిల్లాలకు రెడ్ అలెర్ట్...

రాష్ట్రంలోని కన్నియాకుమారి, తిరునల్వేలి, రామనాథపురం, తూత్తుకుడి జిల్లాల్లో ఈ రాక్షస అలల ఉధృతి తీవ్ర రూపంలో ఉంటాయని ఇండియన్ మారిటైమ్ సంస్థ రెడ్ అలెర్ట్ హెచ్చరిక జారీ చేసింది. ఇదే విధంగా చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్, విల్లుపురం, కడలూరు, నాగపట్టినం జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. రెడ్, ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసిన జిల్లాల్లో నౌకలను, పడవలను జాగ్రత్తగా నడపాలని, అవసరమైతే వాటిని సురక్షిత ప్రాంతాల్లో లంగరేసి ఉంచాలని మారిటైమ్ అధికారులు పేర్కొన్నారు.



మండుటెండలో ముఖానికి తువ్వాలు చుట్టుకుని వెళుతున్న యువతి



పార్కులో నీరు తాగుతున్న వ్యక్తి

అగ్ని నక్షత్రం ప్రారంభం..

పెరిగిన వేసవితాపం

బయటకు రావాలంటే భయం

● 3 నుంచి 5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం
● హెచ్చరించిన వాతావరణ శాఖ



తాటి ముంజలు, తాటిచారు కొనుగోలు చేస్తున్న నగరవాసులు

అడయార్, మే 4: రాష్ట్రంలో అగ్నినక్షత్రం ప్రారంభమైంది. దీంతో ఎండలు మండిపోనున్నాయి. నిజానికి ఫిబ్రవరి నుంచి రాష్ట్రంలో ఎండలు తీవ్రంగా ఉన్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. అనేక జిల్లాల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు సెంచరీ దాటిపోతున్నాయి. ఏప్రిల్ లో ఎండలు మరింత పెరిగాయి. ప్రధానంగా ఈరోడ్, కరూర్, వేలూరు, తిరుపత్తూరు జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో శనివారం నుంచి ప్రారంభమైన అగ్నినక్షత్రం ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగనుంది. దాదాపు 25 రోజుల పాటు ఎండలు మండిపోనున్నాయి. ఈ అగ్నినక్షత్రం ప్రారంభమైన తొలి రోజే అనేక జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు తారస్థాయిలో నమోదయ్యాయి. ముఖ్యంగా చెన్నై నగరంలో శనివారం ఉదయం 8.30 గంటలకే సూర్యుడు తన ప్రతాపం చూపించడం ప్రాంభించి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంది. నగరంలోని ప్రధాన రహదారుల్లో జనసంచారం బాగా తగ్గిపోయింది. వారాంతపు సెలవు రోజు కావడంతో పాటు ఎండ వేడికి నగరంలోని అనేక ప్రధాన రహదారులు బోసిపోయాయి. కాగా రానున్న ఐదు రోజుల్లో పలు జిల్లాల్లో రెండు నుంచి నాలుగు డిగ్రీల మేరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. శనివారం ఉత్తర తమిళనాడులో సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత అధికంగా నమోదైంది. దీంతో ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో కూడా శనివారం 96.8 డిగ్రీల నుంచి 104 డిగ్రీల మేరకు పగటి ఉష్ణోగ్రత నమోదైంది. ఈ నెల 7వ తేదీన మరింత గరిష్ఠంగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నట్టు వాతావరణ శాఖ హెచ్చరించింది. 7వ తేదీ నీలగిరి, ధర్మపురి, కృష్ణగిరి, ఈరోడ్, తిరుపత్తూరు, వేలూరు జిల్లాల్లో ఒకటి రెండు ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచన ప్రాయంగా వెల్లడించింది. అదేసమయంలో ఎండల సమయంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.

అన్నాడీఎంకే పథకాలను అటకెక్కించిన డీఎంకే

● ఎడప్పాడి ఆగ్రహం



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, మే 4: అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో పరిచయం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలన్నింటినీ డీఎంకే ప్రభుత్వం అటకెక్కించిందని, మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మండిపడ్డారు. సేలం ఏర్కాడు వేసవి విడిది కేంద్రం ఘాట్ రోడ్డులో గత నెల 30వ తేది ఓ బస్సు బోల్తాపడిన ప్రమాదంలో ఐదుగురు మృతిచెందగా, 69 మందికి గాయాలయ్యాయి. సేలం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పళనిస్వామి శనివారం ఆసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా పళనిస్వామి మీడియాతో మాట్లాడుతూ... 2021-22వ ఆర్థిక సంవత్సరంలో 5 వేల కొత్త బస్సులు కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించిన డీఎంకే ప్రభుత్వం, ఒక్క బస్సు కూడా కొనుగోలు చేయలేదన్నారు. ఇటీవల కండక్టర్ కూర్చున్న సీటుతో బయటకు జారిపడ్డారని, డొక్కు బస్సుల్లో ప్రయాణం చేసేందుకు ప్రజలు భీతిల్లుతున్నారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలుకు జర్మనీ దేశంతో ఎంవోయూ కుదుర్చుకున్నామని అయితే, ఆ ఒప్పందం ఇప్పటివరకు డీఎంకే ప్రభుత్వంలో అమలులోకి రాలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో తాగునీటి కోసం ప్రజలు రోడ్డుపైకి వచ్చి పోరాడుతున్నారని, అదే విధంగా ఆనకట్టలు, చెరువుల్లో నీటిమట్టాలు గణనీయంగా పడిపోవడంతో తాగు, సాగు నీటికి కొరత ఏర్పడిందని, ఈ సమస్య గురించి డీఎంకే పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సేలం జిల్లా తలైవాసల్ ప్రాంతంలో రూ.1,000 కోట్లతో ఏర్పాటుచేసిన వెటర్నరీ పార్క్ మూసే ఉందని, అన్నాడీఎంకే హయాంలో పూర్తిచేసిన ఈ పార్క్‌ను ప్రారంభించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. తమిళనాడు-కర్ణాటక రాష్ట్రాల మధ్య కుదుర్చుకున్న ఒప్పందం మేరకు కావేరి జలాలను రాష్ట్రానికి పంపిణీ చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం నిరాకరిస్తోందని, ఈ సమస్య పరిష్కారానికి కూడా ముఖ్యమంత్రి స్టాలిన్ ఎలాంటి ప్రయత్నాలు చేయలేదన్నారు. డీఎంకే భాగస్వామ్యం వహిస్తున్న ఇండియా కూటమిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా కావేరి సమస్య గురించి మాట్లాడడం లేదని, సుప్రీంకోర్టు తీర్పును సైతం అమలుపరిచేందుకు డీఎంకే ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించడానికి తిరునల్వేలి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జయకుమార్ ధనసింగ్ హత్యే నిదర్శనమని, మరోవైపు గంజాయి, డ్రగ్స్ విక్రయాలు బాగా పెరిగాయని, అయినా ఈ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను అడ్డుకొనేందుకు పోలీసు శాఖ తీవ్రంగా విఫలమైందని ఈపీఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో మూడేళ్లలో 6115 స్టార్టప్ కంపెనీలు

వెల్లడించిన సీఎం స్టాలిన్



చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకే ద్రావిడ తరహా పాలనలో కల్పిస్తున్న సదుపాయాల కారణంగా మూడేళ్లలో 6115 స్టార్టప్ కంపెనీలు ఏర్పాటయ్యాయని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం మధ్యాహ్నం విడుదల చేసిన ఓ ప్రకటనలో కొత్త కర్మాగారాలు ప్రారంభించేందుకు అనువైన రాష్ట్రమని దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ కంపెనీలు ఎలుగెత్తి చాటుతుండటం వల్లే పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పరిశ్రమలు ప్రారంభించేందుకు ఆసక్తికనబరుస్తున్నారని తెలిపారు. వచ్చే యేడాది జనవరిలో చెన్నైలో యువ పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక మహానాడు నిర్వహించనున్నామని తెలిపారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హాయంలో 2105 స్టార్టప్ కంపెనీలు మాత్రమే ఉండేవని, 2021లో డీఎంకే ద్రావిడ తరహా పాలన ప్రారంభం కాగానే పరిశ్రమల స్థాపనకు కొత్త శకం ప్రారంభమైందని తెలిపారు. ప్రస్తుతం 6115 స్టార్టప్ కంపెనీలు తమ ఉత్పత్తులను కూడా ప్రారంభించాయని, ఈ పరిశ్రమల ద్వారా లక్షలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించాయని వివరించారు. టాన్సిట్ నిధులతో ప్రారంభించిన పరిశ్రమల్లో రూ.314 కోట్ల పెట్టుబడులు అధికమయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో సిప్కాట్ పారిశ్రామికవాడల్లోనూ కొత్త పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని, వచ్చే రెండేళ్లలో రాష్ట్రం పారిశ్రామిక ప్రగతిలో అన్ని రాష్ట్రాలకంటే ముందంజలో ఉంటుందని స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు.

నేడు 'నీట్'కు పటిష్ఠ ఏర్పాట్లు

● చెన్నై సహా 31 నగరాల్లో సెంటర్లు
● పరీక్షా కేంద్రాల వద్ద నిఘా

ప్యారీస్, మే 4: వైద్యకోర్సుల్లో ప్రవేశాల కోసం ఆదివారం 'నీట్' నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5.20 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. తమిళనాడులో సుమారు 1.50 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు. రాజధాని నగరం చెన్నై, కాంచీపురం, తిరువళ్లూర్, కోయంబత్తూర్, కడలూరు, కరూర్, ధర్మపురి, ఈరోడ్, సేలం, తూత్తుకుడి, మదురై, దిండుగల్, కన్నియాకుమారి, వేలూరు, తంజావూరు, విల్లుపురం, నీలగిరి, తిరువారూర్, తిరువణ్ణామలై, రామనాథపురం, పుదుకోట సహా 31 నగరాల్లో నీట్ కోసం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు ఆంగ్లం, తమిళం సహా 13 భాషల్లో నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రానికి అరగంట ముందే రావాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. నీట్ విధివిధానాలను విద్యార్థులు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. డ్రస్ కోడ్, షూ, బెల్ట్ ధరించడానికి ఎలాంటి మార్పులు లేవు. అయితే పరీక్షా కేంద్రాలకు సెల్‌ఫోన్, కాలిక్యులేటర్ సహా ఎలక్ట్రానిక్ పరికరాలపై నిషేధించారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్టుతో ఫొటో కూడా తీసుకురావాలని సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు మాత్రమే రావాలని, ఇతరులను ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించబోమని హెచ్చరించారు. ఇక, పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్ తదితర తప్పులు జరుగకుండా పోలీసు భద్రత కూడా పటిష్ఠం చేశారు.


అనుమానాస్పద స్థితిలో కాంగ్రెస్ నేత మృతి

కొబ్బరితోటలో కాలిన శవం లభ్యం

● ఎమ్మెల్యే సహా ఐదుగురి వలన ప్రాణహాని అంటూ డీఎస్పీకి లేఖ
● ఈపీఎస్, అన్నామలై, అన్బుమణి ఖండన



జయకుమార్ శవం లభించిన కొబ్బరితోట వద్ద విచారణ జరుపుతున్న పోలీసులు




జయకుమార్ ధన్‌సింగ్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా దిసైవినై సమీపం కారుచుత్తుపుదూరు కరుత్తయ్యా గార్డెన్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత కేపీకే జయకుమార్ ధన్‌సింగ్ (60) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్ళిన ఆయన శనివారం ఉదయం తన తోటలో సగం కాలిన స్థితిలో శవంగా పడి ఉండగా కనుగొన్నారు. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. డీఎంకే మిత్రపక్షమైన కాంగ్రెస్ నేత మృతి సంఘటన రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించడాన్ని, పోలీసుల చేతగానితనాన్ని రుజువు పరస్తున్నాయంటూ అన్నాడీఎంకే, పీఎంకే, బీజేపీ పార్టీలు ధ్వజమెత్తాయి. మూడు రోజులకు ముందే తన పార్టీ ప్రముఖుల నుంచి, కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తల నుంచి హత్యాబెదరింపులు వస్తున్నాయని, తను హత్యకు గురైతే ఎమ్మెల్యే సహా ఐదుగురే కారణమని ఆరోపిస్తూ ఆయన పోలీసు ఉన్నతాధికారులకు కాంగ్రెస్ పార్టీ లెటర్‌ప్యాడ్‌లో లేఖ రాసి పంపారు. ఈ అంశాలను పరిశీలిస్తే జయకుమార్ ధనసింగ్‌ను ప్రత్యర్థులు హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులకు పంపిన లేఖలోని ప్రముఖులను ఇప్పటికే పోలీసులు విచారణ జరుపుతున్నారు. అదే సమయంలో ఆయన మృతిని హత్యగా భావించి మూడు ప్రత్యేక పోలీసు బృందాలు హంతకులు ఆచూకీ కోసం గాలింపు చర్యలు ప్రారంభించాయి. రోడ్ల కాంట్రాక్టర్ అయిన జయకుమార్, ఆయన కుటుంబీకులంతా కాంగ్రెస్ పార్టీకి చెందినవారు. దీంతో ఆయనను తిరునల్వేలి తూర్పు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. గురువారం రాత్రి ఆయన కాసేపట్లో తిరిగొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. జయకుమార్ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ళ వద్ద వెదికారు. శుక్రవారం సాయంత్రం వేచి చూసిన జయకుమార్ కుమారుడు కరుత్తయ్యా ఉవరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆయన ఆచూకీ కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. ఆ మేరకు ఆయన ఇంటిలో పోలీసులు తనిఖీ చేయగా ఓ గదిలో డైరీ లభించింది. అందులో తనకు డబ్బులు చెల్లించాల్సిన వ్యక్తుల వివరాలు, అదే విధంగా తాను ఎవరెవరికి డబ్బులు ఇవ్వాలన్న వివరాలను రాసి ఉండటం గమనించారు. ఆ డైరీలోని వివరాల ఆధారంగా ఉవరి పోలీసుస్టేషన్ అధికారులు విచారణ జరుపుతుండగానే ఓ దిగ్భ్రాంతికరమైన సంగతి వెల్లడైంది. జయకుమార్ ఏప్రిల్ 30న తిరునల్వేలి డీఎస్పీ శిలంబరసన్‌కు 'మరణ వాంగ్మూలం' పేరుతో కాంగ్రెస్ పార్టీ లెటర్ ప్యాడ్‌లో ఫిర్యాదు చేశారు. అందులో తనకు రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తల నుండి బెదరింపులు వస్తున్నాయని, తనకు ఏదైనా ప్రాణాపాయం జరిగితే అందుకు వీరే కారకులవుతారని నలుగురి పేర్లు కూడా రాసి ఉంచానని తెలిపారు.. అంతే కాకుండా ఆ నలుగురూ తనకు లక్షలాది రూపాయలను చెల్లించాల్సి ఉందని, వారంతా డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసగించడం వల్లే తాను బయట అప్పులు విపరీతంగా చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఆ లేఖలో జయకుమార్ ధనరాజ్ సింగ్ పేర్కొన్న నలుగురు ప్రముఖుల వద్ద డీఎస్పీ ఆదేశం మేరకు ప్రత్యేక పోలీసు అధికారులు విచారణకు సిద్ధమయ్యారు. ఆ నేపథ్యంలో శనివారం ఉదయం కరైసుత్తుపుదూరులోని జయకుమార్‌కు చెందిన తోటలో సగం కాలిన స్థితిలో ఆయన శవం లభించింది. ఈ సమాచారం తెలుసుకున్న ఉవరి పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాళయంకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జయకుమార్ నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నారా? లేక ప్రత్యర్థులు నిప్పంటించి హతమార్చారా? అనే కోణాలపై దర్యాప్తు ప్రారంభించారు. మూడు రోజులకు ముందే జయకుమార్ తన ప్రాణాలకు ముప్పువాటిల్లే అవకాశం ఉందంటూ డీఎస్పీకి రాసిన లేఖ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా ఆయన శవంగా లభించడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది.

ఆ లేఖలో ఏముంది?....

తిరునల్వేలి డీఎస్పీకి కాంగ్రెస్ నేత జయకుమార్ 'మరణవాంగ్మూలం' శీర్షికన కాంగ్రెస్ పార్టీ లెడర్ ప్యాడ్‌లో ఆయన దిగ్భ్రాంతికరమైన విషయాలను వెల్లడించారు. కొద్ది రోజులుగా తనకు బెదిరింపులు వస్తున్నాయని, రాజకీయాల్లో అదంతా సహజమే కదా అని తాను వాటిని పెద్దగా పట్టించుకోలేదన్నారు. అదే సమయంలో తన ఇంటి వద్ద మూడుసార్లు రాత్రిపూట గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుండడం గమనించానని తెలిపారు. మొదట వారిని దోపిడీ దొంగలుగా ఉంటారని అనుమానించారని, అయితే ఆదే పనిగా తన ఇంటి వద్దే సంచరిస్తుండటంతో వారిపై తనుకు అనుమానం అధికమైందన్నారు. తన ప్రాణాలకు ముప్పువాటిల్లితే నాంగునేరి నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే రూబీ మనోహర్ సహా ఐదుగురే కారకులవుతారని తెలిపారు. కళ్ళికులం ఆలయ మాజీ ధర్మకర్త ఆనందరాజా 18 యేళ్ల క్రితం వళ్ళియూరు ఆర్డీవో ఆఫీసు వద్దనున్న 7.8 ఎకరాల స్థలాన్ని రూ.46 లక్షలకు తనకు విక్రయించాడని, ప్రస్తుతం ఆ స్థలం విలువ కోట్లకు పెరగటంతో ఆ స్థలాన్ని తిరిగివ్వమంటూ బెదరించాడని, ముంబయి నుంచి రౌడీలను తెప్పించి హతమార్చుతానని బెదరించాడని ఆ లేఖలో ఆరోపించారు. ఇదే విధంగా కుత్తాలింగం అనే వ్యక్తి నుంచి 14 యేళ్ళ క్రితం రుణం తీసుకున్నానని, ఆ రుణాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించినా, ఇంకా వడ్డీ బకాయిలు చెల్లించాలంటూ బెదరించాడని పేర్కొన్నారు. ఇక నాంగునేరి ఎమ్మెల్యే రూబీ మనోహర్‌కు పలు పనుల కోసం సుమారు రూ.70లక్షల వరకు ఇచ్చానని, అయితే ఏ కార్యాలను నెరవేర్చలేదని, తన డబ్బు తిరిగివ్వమని అడిగినప్పుడల్లా బెదరించాడని తెలిపారు. ఇదే రీతిలో ఇడయన్‌కుడి చెందిన జయకర్, పుదియంపుత్తూరుకు చెందిన జేసురాజా చంపుతామంటూ పలుమార్లు తనను బెదరించారని, ఈ ఆధారాలను బట్టి తన ప్రాణానికి ముప్పువాటిల్లితే అందుకు వీరే కారకులవుతారని జయకుమార్ డీఎస్పీకి పంపిన లేఖలో ఆరోపించారు.



డీఎస్పీ శిలంబరసన్‌కు జయకుమార్ పంపిన లేఖ

నేతల ఖండన...

కాంగ్రెస్ నేత జయకుమార్ అనుమానాస్పద మృతి సంఘటనపై అన్నాడీఎంకే, బీజేపీ, పీఎంకే నేతలు స్పందిస్తూ డీఎంకే ప్రభుత్వ పాలనలో పోలీసుల నిర్లక్ష్య వైఖరికి నిలువెత్తు నిదర్శనమే ఈ సంఘటన అని ఆరోపించారు. జయకుమార్ ప్రత్యర్థుల నుంచి తనక బెదరింపులు వస్తున్నాయని తెలిపినప్పుడే పోలీసులు ఆయనకు గట్టి భద్రత కల్పించి ఉండాల్సిందని అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

డిసెంబరులో పాంబన్ వంతెనపై రాకపోకలు

పెరంబూర్, మే 4: రామేశ్వరం సమీపం పాంబన్ సముద్రంలో రైల్వే వంతెన నిర్మాణపనులు ఈ ఏడాదిలోగా పూర్తిచేసి డిసెంబరులో అందుబాటులోకి తీసుకు రానున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. పాంబన్ రైలు వంతెన 110 ఏళ్ల ప్రాచీనమైనది. వంతెన మధ్యలో ఇనుప ప్లేట్లు సముద్ర ఉప్పు గాలులతో దెబ్బతినడంతో 2022 నవంబరు 23 నుంచి ఈ వంతెనపై రైళ్ల రాకపోకలు పూర్తిగా రద్దు చేసి, రూ.550 కోట్లతో కొత్త వంతెన నిర్మాణపనులు ప్రారంభించారు. కొత్త వంతెన సముద్రంలో 2.8 కి.మీ మేర ఏర్పాటవుతుండగా, మధ్యలో పెద్ద నౌకలు వెళ్లేందుకు వీలుగా 72.5 మీటర్ల లిఫ్ట్ సాయంతో వంతెన విడిపోయేలా వంతెన నిర్మాణ పనులు మార్చి 13 నుంచి ప్రారంభమయ్యాయి. ఆసియాలో తొలిసారిగా లిఫ్ట్ విధానంలో పనిచేయనున్న వేలాడే వంతెన హైడ్రాలిక్ యంత్రం ద్వారా 17 మీటర్ల ఎత్తు లేపి, తిరిగి యథాస్థానంలోకి తీసుకొచ్చే వీలుంది. ఈ పనులు పూర్తిచేసి డిసెంబరు నుంచి రైళ్ల రాకపోకలు ప్రారంభించనున్నట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.



పాంబన్ వంతెనపై చేపట్టిన మరమ్మతులు

రూ.382 కోట్లు పన్ను వసూలు

ఐసిఎఫ్, మే 4: నగరంలో ఒక నెలలో రూ.382 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. చెన్నై కార్పొరేషన్ ఈ ఆర్థిక సంవత్సరం రూ.1,750 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాలని లక్ష్యం పెట్టుకుంది. ప్రతి ఆర్థిక సంవత్సరం మొదటి అర్థ వార్షికంలో మొదటి 30 రోజుల్లో పన్ను చెల్లించే వారికి 5 శాతం వరకు గరిష్ఠంగా రూ.5,000 రాయితీ కల్పిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 30 రోజుల్లో రూ.370 కోట్లు ఇప్పటివరకు రూ.382 కోట్ల పన్ను వసూలైంది. ఆ ప్రకారం, 5.50 లక్షల మందికి పైగా ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందారు.

వేదారణ్యంలో ముమ్మరంగా ఉప్పు తయారీ



అడయార్, మే 4: నాగపట్టణం జిల్లా వేదారణ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ఉప్పు తయారీ జోరుగా సాగుతోంది. ఈ జిల్లాలోని కొడిక్కాడు అనే ప్రాంతంలో ఏకంగా 9 వేల ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నారు. రాష్ట్రంలో తూత్తుక్కుడి తర్వాత అధిక మొత్తంలో ఉప్పు తయారు చేసే ప్రాంతంగా ఈ జిల్లాకు గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో ఈ యేడాది ఫిబ్రవరి నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉప్పు ఉత్పత్తి కూడా ఊపందుకుంది. సాధారణ రోజుల్లో కంటే గత మూడు నెలలుగా ఉప్పు దిగుబడి అధికంగా ఉంది. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఎండలు మండిపోతున్నాయి. దీంతో ఉప్పు సాగు చేసేవారు కూడా ఎండలకు భయపడిపోతున్నారు. కేవలం ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ఉప్పు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతుండటంతో ఈ ప్రాంతంలో ముమ్మరంగా పనులు సాగుతున్నాయి.

13,529 బస్సులకు మరమ్మతులు

పెరంబూర్, మే 4: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలోని 17,459 బస్సులు దెబ్బతిన్నట్లు గుర్తించి వాటిలో 13,529 బస్సులకు మరమ్మతులు చేపట్టారు. మిగిలిన బస్సులను సోమవారంలోగా సరిచేస్తామని అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా శిథిలమైన బస్సు భాగాలు గుర్తించి 48 గంటల్లో నివేదిక అందజేయాలని గత నెల 26వ తేదీ రాష్ట్రప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రకారం, దెబ్బతిన్న బస్సులను గుర్తించి సత్వరం మరమ్మతులు చేపట్టాలని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే.

రాష్ట్ర పోలీస్ శాఖ వెబ్‌సైట్ హ్యాక్

పెరంబూర్, మే 4: రాష్ట్ర పోలీసు శాఖ 'ఫేస్ డిటెక్షన్' వెబ్‌సైట్ (ఫేషియల్ రికగ్నేషన్ సాఫ్ట్‌వేర్ పోర్టల్) ను హాకర్లు శుక్రవారం స్తంభింపజేశారు. 'వెలేరీ' అనే సాఫ్ట్‌వేర్ ద్వారా హ్యాకర్లు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేశారని పోలీసు శాఖ వెల్లడించింది. ఈ వెబ్‌సైట్‌లో నేరస్తులు, పరారీలో ఉన్న వారు, అనుమానాస్పద వ్యక్తులు తదితరుల వివరాలు నమోదుచేశారు. అలాగే, ఎఫ్ఐఆర్, అందుకు సంబంధించిన కేసుల వివరాలు, 50 వేల మందికి పైగా పోలీసుల వివరాలు ఈ వెబ్‌సైట్‌లో ఉంటాయి. ఈ సమాచారం హ్యాకర్లకు అందించిన పక్షంలో ప్రభుత్వానికి సవాలుగా మారుతుందని నిపుణుల అభిప్రాయం. ఈ విషయమై సీనియర్ పోలీసు అధికారి ఒకరు మాట్లాడుతూ... వెబ్‌సైట్ మొత్తం హ్యాక్ కాలేదని, లాగిన్‌కు సంబంధించిన బ్లాక్ మాత్రమే హ్యాక్ చేశారని, దానిని సరిచేశామని, ఈ విషయమై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు.

సెంట్రల్ జైలులో ఖైదీ మృతి

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): దాడికేసులో అరెస్టయి పుళల్ జైలులో ఉన్న అరుంబాక్కం ప్రాంతానికి చెందిన కమలేష్ అనే ఖైదీ శనివారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పెయింటింగ్ పనులు చేసుకుని బ్రతికే కమలేష్ ఇటీవల యాగేష్ అనే వ్యక్తిపై దాడి చేశాడు. అరుంబాక్కం పోలీసులు కమలేష్‌ను అరెస్టు చేసి పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాల్సిన కమలేష్ ఉన్నట్టుండి అస్వస్థతకు గురై స్టాన్లీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కమలేష్ కుటుంబీకులు స్టాన్లీ ఆసుపత్రికి చేరుకున్నారు. ఇటీవల అరుంబాక్కం పోలీసుస్టేషన్ ఎస్ఐ విచారణ పేరుతో కమలేష్‌ను చితకబాదాడని, ఆ బాధ తట్టుకోలేక మృతి చెంది ఉంటాని కుటుంబీకులు ఆరోపించారు. స్టాన్లీ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత పోలీసులు మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

బస్సులో మహిళ వద్ద నగల దోపిడీ

● ఆంధ్ర మహిళ అరెస్ట్

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగరంలో ప్రభుత్వ ఎంటీసీ బస్సులో ఓ మహిళ వద్ద 18 సవర్ల నగలు దోచుకున్న ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన విమల (33) అనే మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. బాలమురుగన్ అనే ఎంటీసీ బస్సు కండక్టర్ భార్య రాజ్యలక్ష్మి గత మార్చి 23వ తేదీ పొరుగు జిల్లాలో జరిగిన బంధువుల ఇంటి వివాహ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె తాను ధరించిన 18 సవర్ల నగలు విప్పి హ్యాండ్‌బాగ్‌లో భద్రపరచుకొని కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి ఎంటీసీ బస్సులో ఎంజీఆర్ నగర్‌కు బయల్దేరింది. కాశి థియేటర్ బస్టాప్‌లో దిగిన రాజ్యలక్ష్మి తన హ్యాండ్‌బాగ్ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదుచేసింది.. క్రైం విభాగం పోలీసులు కేసు నమోదుచేసి కాశి థియేటర్ బస్టాప్ వద్దనున్న సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించి, ఓ మహిళ హ్యాండ్‌బాగ్‌తో వెళుతుండడం గుర్తించారు. విచారణ జరిపిన పోలీసులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విమలగా గుర్తించి శుక్రవారం రాత్రి వేలూరులో దాగిన ఆమెను అరెస్టు చేశారు.

శ్రీరంగం ఆలయ గోపురం శిథిలం

● మరమ్మతులు ప్రారంభం

ప్యారీస్, మే 4: తిరుచ్చిలో భూలోక వైకుంఠంగా ప్రసిద్ధిచెందిన శ్రీరంగం రంగనాథస్వామి ఆలయంలో శిథిలమైన గోపురానికి శనివారం మరమ్మతులు ప్రారంభించారు. రంగనాథుడు కొలువుదీరిన ఈ ఆలయంలో మొత్తం 21 గోపురాలున్నాయి. వీటిలో భక్తులను దర్శనానికి అనుమతిస్తున్న 236 అడుగుల రాజగోపురానికి పగుళ్లు ఏర్పడ్డాయి. హిందూ దేవాదాయ శాఖ ఈ గోపురం మరమ్మతుపనుల కోసం విరాళాలు సేకరించింది. భవన నిర్మాణ నిపుణుల బృందం శిథిలమైన గోపురాన్ని పరిశీలించి ప్రణాళిక రూపొందించారు. ఆ మేరకు రూ.1.7 కోట్లతో శనివారం ఉదయం రంగనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి గోపురానికి మరమ్మతులు ప్రారంభించారు.

రూ.10 లక్షల మేకల విక్రయాలు

వేలూరు, మే 4: ఆనైకట్టు తాలూకా బెడుగత్తూర్‌లో ప్రతి శనివారం మేకల సంత నిర్వహిస్తుంటారు. ఈ సంతలో పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి రైతులు మేకలు, గొర్రెలు విక్రయానికి తీసుకొస్తుంటారు. ప్రస్తుతం ఎండల కారణంగా తక్కువ సంఖ్యలోనే మేకలను సంతకు తీసుకొచ్చారు. శనివారం జరిగిన సంతలో రూ.10 లక్షల విలువైన మేకలు విక్రయాలు జరిగాయని, సాధారణంగా రూ.50 లక్షల వరకు విక్రయాలు జరుగుతుండగా ప్రస్తుతం తగ్గాయని నిర్వాహకులు తెలిపారు.



బెడుగత్తూర్‌లో సంత నిర్వహిస్తున్న దృశ్యం

భక్తాంజనేయుడికి వెన్నకాపు అలంకారం

వేలూరు, మే 4: స్థానిక కాట్పాడి-చిత్తూర్ బస్టాండ్ సమీపంలో ఉన్న భక్తాంజనేయుడికి శనివారం తెల్లవారుజామున 5 గంటలకు విశేష ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం వెన్నకాపు అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణ, దీపారాధన నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులు తులసి మాలలు సమర్పించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.



య్యూట్యూబర్ శంకర్ అరెస్ట్



సవుక్కు శంకర్

ప్యారీస్, మే 4: ప్రముఖ యూ ట్యూబర్ సవుక్కు శంకర్‌ను కోయంబత్తూర్ సైబర్ క్రైం పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. రాష్ట్ర పోలీసు అధికారులు, మహిళా కానిస్టేబుళ్ల పరువు ప్రతిష్ఠలను కించపరిచే విధంగా మాట్లాడారని శంకర్‌పై కోయంబత్తూర్ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదుచేసి అరెస్ట్ చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో, తేనిలోని ఓ లాడ్జీలో శంకర్ మకాం వేసారనే సమాచారంతో శనివారం తెల్లవారుజామున 3 గంటలకు అక్కడకు వెళ్లిన పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. శంకర్‌ను పోలీసు వాహనంలో కోవైకు తరలిస్తుండగా, తిరుప్పూర్ జిల్లా తారాపురం ఐబీటీ కార్నర్ వద్ద ఎదురుగా నుంచి వచ్చిన కారు పోలీసు వాహనాన్ని వేగంగా ఢీకొంది. దీంతో రెండు వాహనాల ముందు భాగం నుజ్జునుజ్జవగా ప్రమాదంలో ఓ కానిస్టేబుల్, శంకర్‌లకు స్వల్పగాయాలయ్యాయి. దీంతో వారిని తారాపురం ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మరో వాహనంలో కోవై తరలించారు. ప్రమాదానికి కారణమైన కారులో వచ్చిన వ్యక్తికి తీవ్రగాయాలవడంతో అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తెన్‌కాశి ప్రజలను బెంబేలెత్తిస్తున్న ఏనుగు

ప్యారీస్, మే 4: పశ్చిమ కనుమల సమీపంలో ఉన్న తెన్‌కాశి ప్రజలను అడవి నుంచి జనావాసాల్లోకి వచ్చిన ఓ ఏనుగు భయాందోళనలకు గురిచేస్తోంది. తెన్‌కాశి, పరిసర గ్రామాల్లో పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. దీంతో ఆ ప్రాంతంలోని జలపాతాలు, చెరువులు ఎండిపోయాయి. అటవీ ప్రాంతం అధికంగా ఉన్న పశ్చిమ కనుమల్లో కూడా నీటి కష్టాలు నెలకొనండంతో ఆ ప్రాంతంలోని వన్య ప్రాణులు నీర, ఆహారం వెతుక్కుంటూ జనావాసాల్లోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం తమిళనాడు, కేరళ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలైన సెంగోట్టైలోని కృష్ణన్ అనే రైతు మామిడి తోటలో ఉన్న నీటి పంపుసెట్టు వద్ద ఓ ఏనుగు దాహార్తి తీసుకుంటుండడం గుర్తించిన ఆయన వెంటనే అటవీ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఈ సమాచారంతో అక్కడకు చేరుకున్న అటవీ సిబ్బంది ఏనుగును ఆ ప్రాంతం నుంచి తరిమేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆ అడవి ఏనుగు అక్కడ నుంచి 8 గంటల పాటు అక్కడ నుంచి కదలలేదు. దీంతో ఏనుగుకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చి వాహనంలో అడవికి తరలించారు.

మహాబలిపురం సమీపంలో మూడవ నిర్లవణీకరణ కేంద్రం

ఐసిఎఫ్, మే 4: మహాబలిపురం సమీపంలో రూ.4,276.44 కోట్లతో సముద్రం నీటిని తాగునీరుగా మార్చే మూడవ నిర్లవణీకరణ కేంద్రం నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. నగరంలో తాగునీటి కొరత తీర్చేందుకు 2003-04 సంవత్సరంలో సముద్రపు నీటిని తాగునీరుగా మార్చే పథకాన్ని ప్రకటించి, మీంజూరులో కాట్టుపల్లి, ఈస్ట్‌కోస్ట్ రోడ్డు, నూలేరికాడు ప్రాంతాల్లో రోజుకు తలా 10 కోట్ల లీటర్ల సామర్థ్యం కలిగిన నిర్లవణీకరణ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో, మూడో కేంద్రం నిర్మాణానికి గత ఏడాది ఆగస్టు 21వ తేదీ సచివాలయం నుంచి ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఇక్కడ భారీ యంత్రాలతో నిర్మాణపనులు జరుగుతున్నాయి.

గాంధీమండపంలో అభివృద్ధి పనులు

● పరిశీలించిన పౌర సంబంధాల అధికారి



చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండీలో గాంధీ మండపం వద్ద దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ నాడార్ స్మారక మండపం పనులను రాష్ట్ర పౌర సంబంధాల శాఖ అధికారి డాక్టర్ ఆర్ వైద్యనాథన్ శనివారం పరిశీలించారు. 18 ఎకరాల్లో ఉన్న గాంధీమండప ప్రాంతంలోని కామరాజర్ స్మారక మండపం, ద్రావిడోద్యమ నేత పండితర్ అయోధ్యదాసు స్మారక మండపం, స్వాతంత్ర్య సమరయోధుడు రెట్టమలై శీనివాసన్ స్మారక మండపం, మాజీ ముఖ్యమంత్రి భక్తవత్సలం స్మారక మందిరం పునర్నిర్మాణ పనులను పౌర సబంధాల శాఖాధికారి అధికారులతో కలిసి పరిశీలించారు. ఆ పనులకు సంబంధించిన కాంట్రాక్టర్లతో ఆయన చర్చించి వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయమని ఆదేశించారు.

కామరాజర్ స్మారక మందిరం పనులను పరిశీలిస్తున్న డాక్టర్ ఆర్ వైద్యనాథన్ తదితరులు

కుంభకోణం రోడ్డులో ఆకస్మికంగా గొయ్యి

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా కుంభకోణంలోని ప్రధాన రహదారిలో శనివారం ఉదయం ఆకస్మికంగా నాలుగడుగుల గొయ్యి ఏర్పడటంతో వాహన చోధకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. కార్పొరేషన్ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆ రహదారిలో వాహనాలను ప్రత్యామ్నాయ మార్గంలోకి మళ్లించారు. ఆ తర్వాత ఎక్సకవేటర్ తెప్పించి గొయ్యిని కంకర, సిమెంట్ మిశ్రమంతో పూడ్చే పనులు చేపట్టారు. ఈ సంఘటన కారణంగా తంజావూరు వైపు వెళ్లే వాహనాలన్నీ మూడు కిలోమీటర్ల మేర చుట్టుకుని ప్రత్యామ్నాయమార్గంలో వెళ్ళాల్సి వచ్చింది. గొయ్యి ఏర్పడిన ప్రాంతంలో ఇరవైయేళ్లక్రితం భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్‌లు అమర్చిన ప్రాంతమని, కంటైనర్ లారీలు వంటి భారీ వాహనాలు వెళ్లటం వల్ల వత్తిడి అధికమై ఆ పైప్‌లైన్లు పగిలి ఆకస్మిక గొయ్యి ఏర్పడి ఉంటుందని అధికారులు తెలిపారు.



గోతిని పూడ్చిస్తున్న కార్పొరేషన్ అధికారులు

సమాచార దృశ్చిని

20 నుంచి కల్యాణ వరదరాజ పెరుమాళ్ బ్రహ్మోత్సవాలు

ఐసిఎఫ్, మే 4: స్థానిక తిరువొత్తియూర్ కాలడి పేట కల్యాణ వరదరాజ పెరుమాళ్ వైకాశి బ్రహ్మోత్సవాలు ఈనెల20 నుంచి 10రోజులపాటు జరుగనున్నాయి. కాంచీపురం, మీంజూరు ఆలయాల అనంతరం ఇక్కడ వైభవంగా గరుడ సేవ నిర్వహిస్తున్నారు. 20వ తేది ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ రాజగోపురం ముందు 35అడుగుల ఎత్తున భారీ పందిరి ఏర్పాటుచేశారు. 17 ఏళ్ల అనంతరం జరుగనున్న కార్యక్రమంలో వేలాది మంది పాల్గొననున్నారు.

నేడు వ్యాపార సంఘాల పేరవై మహానాడు

ప్యారీస్, మే 4: తమిళనాడు వ్యాపారుల సంఘాల పేరవై 6వ రాష్ట్రస్థాయి మహానాడు స్థానిక వానగరంలోని జీసస్ కాల్స్ లింక్స్ కన్వెన్షన్ హాలులో ఆదివారం జరుగనుంది. 41వ వ్యాపారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పేరవై రాష్ట్ర అధ్యక్షులు కొళత్తూర్ టీ.రవి అధ్యక్షతన మండల అధ్యక్షులు అరుణాచలమూర్తి పర్యవేక్షణలో నిర్వహించనున్న ఈ మహానాడులో వీజీపీ గ్రూప్ సంస్థల అధినేత వీజీ సంతోషం, ఆర్.శరత్‌కుమార్, జస్టిస్ చంద్రూ, నటుడు ఎస్వీ శేఖర్, నటి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొననున్నారు. ఈ మహానాడులో వ్యాపారుల సంక్షేమార్థం పలు తీర్మానాలు ఆమోదించనున్నట్లు ఎంపీ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు దుకాణాల మూసివేత

ఐసిఎఫ్, మే 4: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం దుకాణాలు మూసివేయనున్నట్లు వ్యాపారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు విక్రమరాజా తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... సమాఖ్య ఆధ్వర్యం లో ఆదివారం 41వ వ్యాపారుల దినోత్సవం సందర్భంగా దుకాణాలకు సెలవు ప్రకటించామన్నారు. ఈ సందర్భంగా మదురై వలయన్‌కుళం ఫోర్‌వే సమీపంలో మహానాడు నిర్వహించనున్నామన్నారు. ఈ మహానాడులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యాపారులు పాల్గొననున్నారని తెలిపారు.

కోయంబేడు పూల మార్కెట్ ఉంటుంది

స్థానిక కోయంబేడు పూల మార్కెట్ ఆదివారం పనిచేయనుందని మార్కెట్ నిర్వాహకులు తెలిపారు. మదురైలో ఆదివారం జరుగను న్న వ్యాపారుల మహానాడులో వర్తకులు పాల్గొననున్నారు. ఈ కారణంగా కూరగాయలు, ఆహార ధాన్యాల మార్కెట్లకు 5వ తేదీ సెలవు ప్రకటించారు. అయితే పూల మార్కెట్ యధావిధిగా పనిచేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

11,113 పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం

ఐసిఎఫ్, మే 4: రాష్ట్రవ్యాప్తంగా 11,113 ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో బ్రాడ్ బ్యాండ్ ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పించినట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఆన్‌లైన్ విద్యా విధానాన్ని అభివృద్ధి పరిచేందుకు పాఠశాల విద్యాశాఖ వివిధ చర్యలు చేపడుతోంది. ఆ ప్రకారం, 8,030 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 3,083 మాధ్యమిక పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించినట్లు తెలిపింది. ఈ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఆన్‌లోన్ బోధన జరుగనుందని అధికారులు తెలిపారు.

గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లోనే చేరాలి

ఐసిఎఫ్, మే 4: గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో మాత్రమే బీబీఏ, బీసీఏ కోర్సుల్లో చేరాలని ఏఐసీటీఈ విద్యార్థులను హెచ్చరించింది. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సులకు విద్యాసంస్థలు అఖిల భారత సాంకేతిక విద్యా కౌన్సిల్ (ఏఐసీటీఈ) అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అనుమతి పొందేందుకు, రెన్యువల్‌కు మూడు నెలలుగా దరఖాస్తు స్వీకరణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో, ఏఐసీటీఈ కార్యదర్శి రాజీవ్‌కుమార్ విడుదల చేసిన ప్రకటనలో.. 2024-25 సంవత్సరం నుంచి బీసీఏ, బీబీఏ, బీఎంఎస్, సాంకేతిక కోర్సులకు అనుమతి తప్పనిసరి చేశామని, ఇప్పటివరకు 4,200 విద్యాసంస్థలు మాత్రమే గుర్తింపు పొందాయని తెలిపారు.

కొడైకెనాల్‌లో కొండ గ్రామాల సందర్శనకు అనుమతి

పెరంబూర్, మే 4: దిండుగల్ జిల్లా కొడైకెనాల్ పైనున్న కొండ గ్రామాలకు సందర్శకులను అనుమతించనున్నట్లు అటవీ శాఖ ప్రకటించింది. పూంపారై, మన్నవనూరు, కూక్కాల్ తదితర కొండ గ్రామాలకు వెళ్లే పర్యాటకులు అక్కడి ప్రకృతి అందాలు ఆస్వాదిస్తుంటారు. ఈ క్రమంలో, ఆ గ్రామాలకు వెళ్లే కొండ మార్గంలో కార్చిచ్చు ఏర్పడడంతో ఆ ప్రాంతాలకు సందర్శకులు వెళ్లకుండా నిషేధం విధించారు. ప్రస్తుతం మంటలు అదుపులోకి రావడంతో కొండ గ్రామాలకు పర్యాటకులు వెళ్లొచ్చిని అటవీ శాఖ తెలియజేసింది.

10 నుంచి ఊటీలో పెంపుడు శునకాల ప్రదర్శన

పెరంబూర్, మే 4: నీలగిరి జిల్లా ఊటీలో ఈ నెల 10 నుంచి జాతీయస్థాయి పెంపుడు శునకాల ప్రదర్శన జరుగుతుంది. వేసవి ఫెస్టివల్‌లో భాగంగా ఊటీ బొటానికల్ పార్క్‌లో పుష్ప, పండ్లు, సుగంధ ద్రవ్యాల ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. అలాగే, 10 నుంచి 13 తేది వరకు పెంపుడు శునకాల ప్రదర్శన జరుగుతుందని జిల్లా అధికారులు తెలిపారు.

ఐదేళ్ల లా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మే 4: ఐదేళ్ల లా కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 10 నుంచి 31వ తేది వరకు విద్యార్థులు దరఖాస్తు చేయాలని డా.అంబేడ్కర్ న్యాయ విశ్వవిద్యాలయం ప్రకటించింది. వర్సిటీ పరిధిలోని కళాశాలల్లోని ఈ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు www.tndalu.ac.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే, మూడేళ్ల లా కోర్సు, పీజీ లా కోర్సుల అడ్మిషన్లపై త్వరలో ప్రకటన విడుదల చేస్తామని వర్సిటీ తెలియజేసింది.

విమాన సేవలు పెంపు

పెరంబూర్, మే 4: వేసవి సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం విమాన సేవలు పెంచినట్లు అధికారులు తెలిపారు. తూత్తుకుడి, తిరుచ్చి, మదురై, కోయంబత్తూర్ సహా బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ, కొల్‌కత్తా మధ్య నడిచే విమానాలు పెంచారు. ఆ ప్రకారం, చెన్నై-తూత్తుకుడి మధ్య ప్రతిరోజు 6 విమానాలు నడుపుతుండగా ప్రస్తుతం ఎనిమిదికి పెంచారు. అలాగే, చెన్నై-కోవై మధ్య నడుపుతున్న 12 విమానాలను 16కు, చెన్నై-మదురై మధ్య నడుపుతున్న 10 విమానాలను 14కు, చెన్నై-బెంగళూరు మధ్య నడుపుతున్న 16 విమానాలను 22కు, చెన్నై-హైదరాబాద్ మధ్య నడుపుతున్న 20 విమాన సేవలను 28 సర్వీసులకు పెంచినట్లు అధికారులు తెలిపారు.



వేలూరు తందై పెరియార్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను శనివారం పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

పొల్లాచ్చిలో జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం

ప్యారీస్, మే 4: కోవై జిల్లా పొల్లాచ్చిలోని ఆనమలై సమీపంలో 950 జిలెటిన్ స్టిక్కులు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆనమలై పోలీసు ఎస్ఐ మురుగనాథన్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి ఆనమలై, గణపతిపాళయం ప్రాంతాల్లో గస్తీకి వెళ్లారు. ఆ సమయంలో గణపతిపాళయం ప్రాంతంలోని ఓ తోటలో పేలుడు పదార్థాలు దాచినట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అక్కడ తనిఖీ చేసి జిలెటిన్ స్టిక్స్‌తో పాటు రాళ్ల బద్దలుకొట్టేందుకు వినియోగించే డిటోనేటర్లు, పేలుడు పదార్థం,వైర్లు, బ్యాటరీలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో తోట యజమాని రామస్వామి (50)ని అరెస్ట్ చేశారు.

జలకంఠేశ్వరాలయంలో ప్రత్యేక అభిషేకాలు

వేలూరు, మే 4: స్థానిక కోటలో ఉన్న జలకంఠేశ్వరాలయంలో అగ్నినక్షత్రం ప్రారంభం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉష్ణోగ్రత తాపం నుంచి తగ్గించేందుకు జలకంఠేశ్వరుని శివలింగంపై ధారా పాత్ర ఉంచి దానిలో నీరు పోసి, నీరు ఆగకుండా శివలింగంపై పడేలా ఈ దారాభిషేకం నిర్వహించారు. అగ్ని నక్షత్రం పూర్తయ్యే వరకు ఈ నెల 28వ తేది వరకు ఈ అభిషేకాలు నిర్వహించనున్నారు. అగ్ని నక్షత్రం ప్రారంభం కావడంతో ప్రత్యేక అలంకరణ లేకుండా స్వామివారు దర్శనమివ్వనున్నారు.

మూడు ఆలయాల్లో చోరీ

వేలూరు, మే 4: గుడియాత్తం గాంధీ నగర్ తిరుమగల్ కళాశాల ఎదురుగా ఉన్న శ్రీ శక్తి వినాయక ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఈ ఆలయంతో పాటు విష్ణుదుర్గా ఆలయం, వీరాంజనేయ ఆలయంలోను ప్రవేశించిన అగంతకులు మూడు ఆలయాల్లో హుండీల్లోని నగదు, వస్తువులు దోచికెళ్లారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదుతో గుడియాత్తం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రూ.లక్ష విలువైన గుట్కా స్వాధీనం

ప్యారీస్, మే 4: కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్ ప్రాంతంలో చట్టవిరుద్ధంగా గుట్కా విక్రయించిన సోదరులను అరెస్ట్ చేశారు. శ్రీపెరుంబుదూర్ సమీపంలోని మన్నూర్ ప్రాంతంలో ఓ ఆటోలో ప్రభుత్వ నిషేధించిన గుట్కా పదార్థాలను కిరాణా దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం తెలిసింది. డీఎస్పీ సురేష్‌కుమార్ నేతృత్వంలో శనివారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆ సమయంలో వచ్చిన లోడు ఆటో ఆపి తనిఖీ చేశారు. అందులో గోనె సంచుల్లో ఉన్న గుట్కా ఉత్పత్తులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో వెల్లారితాంగళ్ ప్రాంతానికి చెందిన నాగరాజ్, శివ అనే సోదరులను అరెస్ట్ చేశారు.

కోతగిరిలో మినీ బస్సు బోల్తా

● బాలుడి మృతి, 32 మందికి గాయాలు

ప్యారీస్, మే 4: నీలగిరి జిల్లా కోతగిరి ఘాట్ రోడ్డులో ఓ మినీ బస్సు వందడుగుల లోతులో బోల్తాపడిన ప్రమాదంలో ఓ బాలుడు మృతిచెందగా, 32 మంది పర్యాటకులకు గాయాలయ్యాయి. వీరు పెరంబూర్ కొళత్తూర్ ప్రాంతానికి చెందిన వారని పోలీసుల విచారణలో తెలిసింది. కొళత్తూర్‌కు చెందిన 31 మంది గత నెల 30వ తేది నగరం నుంచి నీలగిరి ఎక్స్‌ప్రెస్‌లో మేట్టుపాళయానికి వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి ఓ మినీ బస్సు అద్దెకు తీసుకొని ఊటీ బయల్దేరారు. దిండుగల్ జిల్లా పళనికి చెందిన కార్తీక్ ఆ మినీ బస్సును నడిపాడు. ఊటీలో ఉన్న పర్యాటక ప్రాంతాలను సందర్శించిన అనంతరం శుక్రవారం సాయంత్రం అక్కడి నుంచి మేట్టుపాళయం రైల్వేస్టేషన్‌కు వారు మినీ బస్సులో బయల్దేరారు. బస్సు ఘాట్ రోడ్డు దిగుతున్న సమయంలో కుంజప్పన్ ప్రాంతంలోని మలుపులో హఠాత్తుగా అదుపుతప్పిన వాహనం 100 అడుగుల లోయలో పడింది. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది సుమారు గంట శ్రమించి డ్రైవర్ సహా 31 మందిని అంబులెన్స్‌లో మేట్టుపాళయం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చికిత్స ఫలించక యోగేష్ కుమారుడు సర్వేష్ (4) అనే బాలుడు శనివారం ఉదయం మరణించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థినికి లైంగిక వేధింపులు

● వైద్యుడిని చితకబాదిన బంధువులు

పెరంబూర్, మే 4: విల్లుపురంలో ఫిజియోథెరపీ చేసేందుకు వచ్చిన కళాశాల విద్యార్థినిపై వైద్యుడు లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన ఉద్రిక్తతలకు దారితీసింది. విల్లుపురం రంగనాథన్ వీధిలో ఉన్న డీఎస్ ఆర్థో కేర్ సెంటర్‌లో ఎముకల విభాగంలో ఫిజియోథెరపీ కోసం వెళ్లిన 21 ఏళ్ల విద్యార్థినిపై అక్కడ పనిచేస్తున్న వైద్యుడు సంతోష్‌కుమార్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న బాధిత బాలిక బంధువులు ఆస్పత్రికి చేరుకొని వైద్యుడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఈఘటనపై రెండుసెక్షన్ల కింద కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భార్యను ప్రసవానికి పంపించి రెండో వివాహం చేసుకున్న భర్త

అడయార్, మే 4: సేలం డీఐజీ సర్కిల్ పరిధిలో కట్టుకున్న భార్యను ప్రసవానికి పంపించిన భర్త.. మరో యువతిని రెండో వివాహం చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మొదటి భార్య తనకు న్యాయం కోరుతూ చంటి బిడ్డతో డీఐజీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగింది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే, సేలం జిల్లా ఆత్తూరు సమీపంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన మూవరసి (23)కి గత యేడాది మార్చినెలలో కుడియరసు అనే వ్యక్తితో వివాహం జరిగింది. వివాహ సమయంలో భారీగానే కట్నకానుకలు అత్తింటివారు అందజేశారు. ఈ క్రమంలో మూవరసి ప్రసవం కోసం పుట్టింటికి వెళ్ళి అక్కడ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని భర్తకు తెలిపినప్పటికీ అటువైపు వెళ్ళలేదు. దీంతో సందేహించిన అత్తింటివారు కుడియసు ఇంటికి వెళ్ళి ఆరా తీయగా రెండో వివాహం చేసుకున్నట్టు తెలిసింది. దీంతో దిగ్భ్రాంతికి గురైన మూవరసి.. చంటి బిడ్డతో సేలం డీఐజీ ఉమ కార్యాలయానికి వెళ్ళి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, విచారణ జరిపి నివేదికివ్వాలని ఆత్తూరు పోలీసులను డీఐజీ ఉమ ఆదేశించారు.

నామ్ తమిళర్ కట్చి జిల్లా కార్యదర్శి అరెస్టు

అడయార్, మే 4: నామ్ తమిళర్ కట్చి తిరువళ్ళూరు జిల్లా కార్యదర్శి పా.పశుపతిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వడలూరులోని ప్రపంచ పరిశోధనా కేంద్రం పేరుతో భూసేకరణను వ్యతిరేకించడంతో పాటు ఈ కేంద్రం నిర్మాణ పనులను శాశ్వతంగా నిలిపివేయాలని కోరుతూ నామ్ తమిళర్ కట్చి తిరువళ్ళూరు జిల్లా కార్యదర్శి పా.పశుపతి ఆధ్వర్యంలో శనివారం మహాధర్నా జరుగుతుందని ప్రకటించారు. దీనికి పోలీసులు అనుమతివ్వలేదు. అయినప్పటికీ నామ్ తమిళర్ కట్చి నేతలు, కార్యకర్తలు ఆందోళనకు సిద్ధమయ్యారు. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పశుపతితో పాటు కార్యకర్తలను అరెస్టు చేసి, వారందరినీ ఓ కల్యాణ మండపంలో నిర్బంధించారు.

బాలిక కిడ్నాప్... వేధింపులు

● యూపీ యువకుడి కోసం గాలింపు

అడయార్, మే 4: స్థానిక అరుంబాక్కంకు చెందిన బాలికను ఉత్తర ప్రదేశ్‌కు చెందిన యువకుడు కిడ్నాప్ చేసి, వేధించాడు. ఈ విషయం తాజాగా వెలుగులోకి రావడంతో పరారీలో ఉన్న ఆ యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. వారం రోజుల క్రితం 14 యేళ్ళ బాలిక కనిపించకుండా పోయిందని బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఆ బాలిక కోసం గాలించారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి తప్పిపోయిన బాలిక ఇంటికి వచ్చింది. ఆమెను పోలీసులు ప్రశ్నించగా తనను యూపీకి చెందిన ఒక యువకుడు ప్రేమ పేరుతో వెంటపడుతూ, బలవంతంగా తనతో తీసుకెళ్ళాడు. కొన్ని రోజులు పాటు అతడివద్ద ఉంచుకుని వేధించి, గురువారం రాత్రి అరుంబాక్కం వద్ద వదిలివెళ్ళాడని చెప్పింది. పైగా కిడ్నాప్ వ్యవహారం ఎవరికైనా చెబితే అశ్లీల ఫొటోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరించారని తెలిపారు. అన్నా నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడని బాలిక వెల్లడించంది. కాగా, ఆ బాలిక ఇచ్చిన వివరాల ఆధారంగా యూపీకి చెందిన యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రూ.1.2 కోట్ల మోసం.. ఇద్దరికి లుకౌట్ నోటీసు

అడయార్, మే 4: తిరునెల్వేలి సమీపంలో నగల వ్యాపారిపై దాడి చేసి రూ.1.2 కోట్లు దోపిడీ చేసిన కేసులో ఇద్దరు నిందితులు దేశందాటి వెళ్ళిపోయారు. వారి కోసం పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. నెల్లై టౌన్‌కు చెందిన సుశాంత్ కుమార్ కేరళలో బంగారు నగలు కొనుగోలు చేసేందుకు తన కారులో రూ.1.2 కోట్లతో వెళ్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఓ ముఠా కార్లలో వచ్చి సుశాంత్ కుమార్‌పై దాడి చేసి ఆ నగదు దోపిడీ చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా దోపిడీలో మొత్తం 14 మంది ఉన్నట్టు గుర్తించారు. వీరిలో 10 మందిని అరెస్టు చేయగా, ఎనిమిది మందిపై గూండా చట్టం ప్రయోగించారు. అలాగే, ఈ కేసులోని నిందితుల్లో మరో ఇద్దరు విదేశాలకు పారిపోయారు. వారిని స్వదేశానికి రప్పించేందుకు లుకౌట్ నోటీసులు జారీ చేశారు.



మీడియా సమావేశంలో చిత్ర బృందం

గోపురం బ్యానరులో పనిచేయడం అదృష్టం

● హీరో సంతానం

తమిళ చిత్రపరిశ్రమలోని బడా నిర్మాణ సంస్థల్లో ఒకటైన గోపురం ఫిలిమ్స్ బ్యానరులో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్టు నటుడు సంతానం అన్నారు. ఈ సంస్థ అధినేత అన్బుచెళియన్ తలచుకుంటే ఎంత పెద్ద స్టార్ లేదా ఒక అనామకుడితో సినిమా తీసి ఆడించగలరని, అలాంటి నిర్మాతతో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. నిర్మాత అన్బుచెళియన్ సమర్పణలో గోపురం ఫిలిమ్స్ పతాకంపె సుష్మిత అన్బుచెళియన్ నిర్మించిన చిత్రం 'ఇంగు నాన్‌దాన్ కింగు'. ఆనంద్ నారాయణ్ దర్శకుడు. సంతానం, ప్రియాలయ జంటగా నటించగా, తంబి రామయ్య, వివేక్ ప్రసన్న బాల శరవణన్, మునీష్కాంత్, అతుల్ మారన్, శేషు, స్వామినాథన్, కూల్ సురేష్, మనోబాల ఇతర పాత్రలను పోషించారు. సంగీతం డి.ఇమ్మాన్. ఈ నెల 10న ఈ చిత్రం విడుదలకానున్న నేపథ్యంలో శుక్రవారం నగరంలో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఇందులో హీరో సంతానం మాట్లాడుతూ, 'రజినీకాంత్ సినిమాలోని ఓ డైలాగ్‌ను ఈ సినిమాకు టైటిల్‌గా పెట్టాం. అంతకుమించి నిగూఢార్థం ఇందులో లేదు. 'వడకపట్టి రామస్వామి' వంటి హిట్ చిత్రం తర్వాత గోపురం ఫిలిమ్స్ బ్యానరులో నటించడం ఆనందంగా ఉంది. ఈ బ్యానరులో, నిర్మాత అన్బుచెళియన్ వద్ద పనిచేయాలని పెద్ద హీరో నుంచి చిన్న నటీనటుల వరకు కోరుకుంటారు. అలాంటి అవకాశం నాకు వచ్చింది. పూర్తి వినోదాత్మకంగా సాగుతుంది. రాజకీయాల్లోకి రావాలన్న ఆశ లేదు. హీరోయిన్ అనుష్కతో కలిసి గతంలో కొన్ని చిత్రాల్లో పనిచేశారు. ఆమె సరసన హీరోగా నటించాలంటే సరైన కథ లభించాలి. మీడియా ప్రశ్నలు అడిగినంత ఈజీ కాదు ఏదైనా నెరవేరాలంటే. ఏదో ఒక వివాదాస్పద ప్రశ్న వేసి నన్ను ఇరుకున పెట్టి, వివాదంలోకి లాగాలన్న కోణంలోనే మీరు ఆలోచన చేస్తుంటారా? అంటూ హీరో సంతానం మీడియాను ప్రశ్నించారు. ఆ తర్వాత హీరోయిన్ ప్రియలయ, నిర్మాతలు అన్బుచెళియన్, సుష్మిత అన్బుచెళియన్, దర్శకుడు ఆనంద్ తదితరులు ప్రసంగించారు.

పాటల హక్కులు నిర్మాతలకే సొంతం

● నిర్మాత కె.రాజన్

చిత్రజ్యోతి

చలనచిత్రాల్లోని పాటల సంగీత హక్కులు ఆయా చిత్రాల నిర్మాతలకే సొంతమని సీనియర్ నిర్మాత, నటుడు కె.రాజన్ అన్నారు. శ్రీసాయి సైంధవి క్రియేషన్స్ పతాకంపై పి.పాండురంగన్ నిర్మాణ సారథ్యంలో గజేంద్ర దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం 'కుట్రం తవిర్'. ఈ చిత్రం ప్రారంభోత్సవ పూజా కార్యక్రమం నగరంలో జరిగింది. రిషి రిత్విక్ హీరో, ఆరాధ్య హీరోయిన్. ఇతర పాత్రల్లో శరవణన్, సెన్‌రాయన్, వినోదిని తదితరులు నటిస్తున్నారు. పీకేహెచ్ దాస్ ఛాయాగ్రహణం అందిస్తుండగా, శ్రీకాంత్ దేవా సంగీతం సమకూర్చనున్నారు. ఈ చిత్రం తొలిషాట్‌కు నిర్మాత కె.రాజన్ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'సమాజంలో ఉన్నవారంతా నేరాలకు దూరంగా ఉంటూ మంచి పనులే చేస్తూ, మంచి మాటలే మాట్లాడుతూ, సత్‌ప్రవర్తనతో మెలగాలన్న కాన్సెప్టుతో ఈ చిత్రాన్ని తెరకెక్కించడం చాలా సంతోషం. కథకు అతికినట్టుగానే టైటిల్ కూడా ఉంది. నిర్ణయించుకున్న షెడ్యూల్స్ ప్రకారం చిత్రీకరణ పూర్తి చేసుకుని అనుకున్న సమయంలో విడుదలకావాలని కోరుతున్నారు. ఒక చిత్రంపై ఉన్న హక్కులు ఆ చిత్ర నిర్మాతకే సొంతం. పాటలతో పాటు ఆ పాటల సంగీతంపై కూడా నిర్మాతకే హక్కు ఉంది. కథ, దర్శకుడు, టెక్నీషియన్లు, నటీనటులు ప్రతి ఒక్కరినీ ఎంపిక చేసుకునేది నిర్మాత. కథకు తగినట్టుగా దర్శకుడి సూచన మేరకు సంగీత దర్శకుడు సంగీతం అందిస్తారు. దర్శకుడు చెప్పేది సంగీత దర్శకుడు చేస్తారు. ఒకసారి 10 ట్యూన్లు ఇస్తే, మరోసారి 25 ట్యూన్లు అడిగి తీసుకుంటాం. వాటిలో సినిమాకు అవసరమైన ట్యూన్లను ఎంపిక చేసుకుంటాం. ఒక సినిమాలో కథ, పాటలు, సంగీతం ఇలా ప్రతి ఒక్క అంశంలోనూ పూర్తి హక్కులు ఆ చిత్ర నిర్మాతకే ఉంటాయని' అని స్పష్టం చేశారు. ఆ తర్వాత చిత్ర దర్శకుడితో పాటు చిత్ర బృందం సభ్యులు, టెక్నీషియన్లు తదితరులు ప్రసంగించారు.



తొలి షాట్‌కు క్లాప్ కొడుతున్న నిర్మాత కె.రాజన్



ఒప్పంద పత్రాలను చూపుతున్న ఐసరి కె.గణేష్, వెట్రిమారన్

వేల్స్ వర్సిటీతో వెట్రిమారన్

'ఐఐఎఫ్‌సీ' ఒప్పందం

నగరంలోని డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో ఒకటైన వేల్స్ విశ్వవిద్యాలయంలో జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ దర్శకుడు వెట్రిమారన్‌కు చెందిన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ కల్చర్ (ఐఐఎఫ్‌సీ) అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు అవగాహన ఒప్పంద పత్రాలపై వేల్స్ చాన్సలర్ డాక్టర్ ఐసరి కె.గణేష్, దర్శకుడు వెట్రిమారన్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం మేరకు మూడేళ్ళ బీఎస్సీ ఫిల్మ్ స్టడీస్, రెండేళ్ళ ఎంఎస్సీ ఫిల్మ్ అండ్ కల్చరల్ స్టడీస్, ఒక యేడాది పీజీ డిప్లొమో ఇన్ మీడియా స్కిల్స్ కోర్సుల్లో చేసే విద్యార్థులకు ఐఐఎఫ్‌సీ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా దర్శకుడు వెట్రిమారన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అనేక జిల్లాలు ఆర్థికంగా వెనుకబడివున్నాయి. ఇలాంటి జిల్లాల్లో కళ, కళలు, సినిమాల ద్వారా సమాజంలో సమానత్వాన్ని తీసుకునిరావడమే ఐఐఎఫ్‌సీ లక్ష్యం. ఇందుకోసం విద్యార్థులకు ప్రాసెసింగ్ లెర్నింగ్‌తో శిక్షణ, కోర్సులను ఆఫర్ చేస్తున్నాం. ఐఐఎఫ్‌సీలో చేరిన విద్యార్థులకు ఉచిత విద్య, భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నాం. వేల్స్ వర్సిటీ అధినేతకు ఒక ఫోన్ కాల్‌తో ఈ ఒప్పందం కార్యరూపం దాల్చింది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ కీలక ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు డాక్టర్ ఐసరి కె.గణేష్ తెలిపారు.

చిన్న బడ్జెట్ చిత్రాల కోసం

ప్రత్యేక ఓటీటీ ఫ్లాట్‌ఫాం

తమిళ చిత్రపరిశ్రమలో చిన్న బడ్జెట్‌తో రూపుదిద్దుకునే మంచి చిత్రాలకు వరప్రసాదంగా ఓటీటీ ప్లస్ పేరుతో ఓటీటీ ప్లాట్‌ఫాం అందుబాటులోకి వచ్చింది. కోలీవుడ్‌లో ప్రతి యేటా సుమారుగా 200 వరకు చిత్రాలు నిర్మాణమవుతున్నాయి. అయితే, వీటిలో అనేక చిన్న బడ్జెట్ చిత్రాలు విడుదలకు నోచుకోవడం లేదు. ఒక వేళ విడుదలైనప్పటికీ రెండు మూడు రోజులకు మించి ప్రదర్శించడం లేదు. దీంతో మంచి కథలతో రూపొందే అనేక చిత్రాలు ప్రేక్షకులకు అందుబాటులోకి రాకుండానే పోతున్నాయి. వీటికి పరిష్కారమార్గంగా చిన్న బడ్జెట్ చిత్రాల కోసమే ఈ ఓటీటీ ప్లస్ ప్లాట్‌ఫాం రూపొందించారు. ఎంఆర్ శ్రీనివాసన్, సుధాకర్, కేబుల్ శంకర్ కలిసి ఈ ప్లాట్‌ఫాం స్థాపించారు. దీని ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం రాత్రి నగరంలో జరిగింది. ప్రముఖ దర్శకుడు శీను రామస్వామి పాల్గొని ఈ ఓటీటీ ప్లస్ ప్లాట్‌ఫాంను ప్రారంభించారు. భవిష్యత్‌లో నిర్మితమయ్యే చిన్న చిత్రాలకు ఈ ఓటీటీ ప్లాట్‌ఫాం ఒక మంచి వరప్రసాదంగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ ప్లాట్‌ఫాం నెలవారీ సబ్‌స్క్రిప్షన్ రూ.99 కాగా, వార్షిక చందాగా రూ.299 నిర్ణయించారు. ఇందులో కీరా దర్శకత్వం వహించిన 'వీమన్' స్ట్రీమింగ్ అవుతుంది. అలాగే, 'బికినీ సమయల్' అనే గ్లామర్ షో కూడా త్వరలోనే టెలికాస్ట్ కానుంది.



'ఓటీటీ ప్లస్'లో ప్రారంభోత్సవంలో శీను రామస్వామి

చేపల వేటకు విరామం



పడవ అడుగుభాగంలో వెల్డింగ్ చేస్తున్న కార్మికుడు



తీరం వద్ద బారులుదీరిన మరపడవలు



పడవలకు రంగులేస్తున్న కార్మికుడు



పడవ తయారీలో వడ్రంగులు

● మరపడవల మరమ్మతు ముమ్మరం ● కొత్త పడవల నిర్మాణానికి శ్రీకారం

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేపల వేట నిషేధ కాలం అమలులో ఉండటంతో మత్స్యకారులు మరపడవల మరమ్మతులు, కొత్త పడవల తయారీ పనుల్లో నిమగ్నమయ్యారు. చేపల వలలు కూడా బాగుచేసుకుంటున్నారు. అదే సమయంలో కాశిమేడు సహా ప్రధాన చేపల రేవుల్లో చేపల ధరలు రెండింతలయ్యాయి. దీంతో నగరవాసులు రుచికరమైన చేపల కోసం ఎక్కువ ఖర్చుపెడుతున్నారు. ప్రతియేటా ఏప్రిల్ 12 నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకూ సముద్రంలో చేపల సంతానోత్పత్తి కాలంగా పరిగణించి తిరువళ్లూరు జిల్లా ఆరంబాక్కం నుంచి కన్యాకుమారి వరకూ కోస్తా జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వం చేపల వేట నిషేధాన్ని అమలు చేస్తుంది. ఈ నిషేధ కాలంలో జాలర్లు 28 హెచ్‌పీ ఇంజన్ కలిగిన మోటారు పడవలతో లోతైన సముద్రంలో చేపల వేటకు వెళ్లరు. నగరంలో చేపలవేట నిషేధం అమలులోకి రావటంతో 800లకు పైగా మరపడవలు తీరంలో లంగరేశారు. కాశిమేడు తీరంలో ప్రస్తుతం ఫైబర్ పడవల్లో వెళ్ళి సాధారణ రకం చేపలతో తిరిగొస్తున్నారు. దీంతో వారాంతాల్లో చేపలకోసం వచ్చే నగరవాసులతో సందడిగా కనిపించే కాశిమేడు చేపల రేవు మార్కెట్ ప్రస్తుతం గతంలా మేలి రకం చేపల అమ్మకాలు లేక బోసిపోయింది. రానున్న రెండు నెలల్లో చేపలు, పీతలు, రొయ్యల ధరలు రెట్టింపు అవుతాయని మత్స్యకారులు చెబుతున్నారు. నిషేధ కాలంలో మత్స్యకారులు తమ మరపడవలకు. వలలకు మరమ్మతులు చేపడతారు. అసరవమనుకుంటే కొత్త పడవలను తయారు చేసుకుంటారు. చెంగల్పట్టు జిల్లాలోని కానత్తూరురెడ్డి కుప్పం నుంచి ఇడైకళినాడు కుప్పం వరకు 36 జాలర్ల కుప్పాలున్నాయి. ఈ గ్రామాల్లో 7500 మందికిపైగా జాలర్ల కుటుంబాలు నివసిస్తున్నాయి. చేపలవేట నిషేధకాలంలో 80 వేల మందికిపైగా మత్స్యకారులు రెండు నెలలపాటు సంపాదన లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటారని జాలర్ల సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ నిషేధకాలంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. గత యేడాది రామేశ్వరంలో జరిగిన రాష్ట్ర మత్స్యకారుల సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్ చేపలవేట నిషేధ కాలంలో జాలర్లకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాన్ని రూ.5వేల నుంచి రూ.8వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఆమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ యేడాది నుంచి రూ.8 వేలు ప్రోత్సాహక నగదు అందజేస్తోందని చెప్పారు. కర్ణాటక,మహారాష్ట్ర, గోవా సహా పశ్చిమతీరం వెంబడి అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లో చేపల వేట నిషేధాన్ని అమలు చేస్తున్నారని, అయితే రాష్ట్రంలో తిరువళ్లూరు, కాంచీపురం, కడలూరు, కారైక్కాల్ సహా 16 కోస్తా జిల్లాల్లో వేసవిలో అదీ ఏప్రిల్, మే, జూన్ నెలల్లో చేపలవేట నిషేధం అమలు చేస్తున్నారన్నారు. వాస్తవానికి ఏప్రిల్ నుంచి జూన్ వరకు మండుటెండలుంటాయని, ఆ సమయంలో చేపల సంతానోత్పత్తి జరుగుతుందా అనేది అనుమానమేనన్నారు.ఈ అంశాలపై ప్రభుత్వం పరిశీలించి చేపల వేట నిషేధ కాలాన్ని మార్చాలని డిమాండ్ చేశారు.ఇక చేపల వేట నిషేధ కాలంలో చేపలు పట్టేందుకు నిషేధిత వలలను మినహాయించి ఫైబర్ పడవలను అనుమతించాలని పళవేర్కాడు ప్రాంతానికి చెందిన మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. కాగా చేపలవేట నిషేధకాలంలో మరపడవలను తీరాల్లోలంగేరేసి ఉండచడం వల్ల తరచూ అగ్ని ప్రమాదాలు సంభవించి కొన్నిపడవలు దగ్ధమవటం ఆనవాయితీగా మారిందని, ఈ పరిస్థితుల్లో పెద్ద సంఖ్యలో లంగరేసి ఉంచిన మరపడవలకు అందుబాటులో ఫైరింజన్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.





పాత పడవలను మరమ్మతు చేస్తున్న కార్మికులు



పుష్ప ప్రదర్శనకు సిద్ధమవుతున్న ఊటీ బొటానికల్ పార్క్

ఊటీకి ఐదు నిమిషాలకు ఒక బస్సు

పెరంబూర్, మే 4: పర్యాటకుల సౌకర్యార్థం మేట్టుపాళయం నుంచి ఊటీకి ఐదు నిమిషాలకు ఒక బస్సు నడుపనున్నట్లు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రకటించింది. ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రం ఊటీకి దేశ, విదేశాలకు చెందిన పర్యాటకులు వస్తుంటారు. ముఖ్యంగా వేసవి విడిది కేంద్రంగా పిలిచే ఊటీకి వేసవి ఎండల ఉపశమనం పొందేందుకు కుటుంబాలతో కలసి పర్యాటకులు వస్తుంటారు. ఊటీ వచ్చే పర్యాటకులకు మరింత ఆహ్లాదం కలిగించేలా ఉద్యానవన, వ్యవసాయ శాఖలు పుష్ప, పండ్లు, సుగంధ ద్రవ్యాల ప్రదర్శన ఏర్పాటు చేస్తుంటాయి. ఈ ఏడాది పుష్ప ప్రదర్శన ఈ నెల 10వ తేది ప్రారంభం కానుంది. ఇప్పటికే ఊటీకి వచ్చే పర్యాటకుల సంఖ్య భారీగా పెరగడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీనిపై స్పందించిన హైకోర్టు, ఊటీకి వచ్చే పర్యాటకుల వాహనాలకు ఈ-పాస్ విధానం అమలుచేయాలని ఉత్తర్వులు జారీచేసింది. దీంతో నీలగిరి జిల్లాకు చెందిన వాహనాలకు మాత్రం ఈ-పాస్ విధానం నుంచి మినహాయింపు ఇచ్చినట్లు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు తప్పనిసరిగా ఈ-పాస్ పొందాలని జిల్లా యంత్రాంగం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో, పర్యాటకుల సౌకర్యార్థం కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళయం నుంచి ఊటీకి ఐదు నిముషాలకు ఒక బస్సు నడుపనున్నట్లు రవాణా శాఖ ప్రకటించింది.

ఊటీలో అకాల వర్షం



వర్షంలో గొడుగులు వేసుకుని వెళ్తున్న పర్యాటకులు

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో ప్రతియేటా జూన్ నుంచి సెప్టెంబర్ దాకా నైరుతి రుతుపవనాల ప్రభావంతో 700 మీమీ.ల వరకు వర్షపాతం నమోదువుతుంది. అక్టోబర్ నుంచి డిసెమబర్ వరకు ఈశాన్య రతుపవనాల ప్రభావంతో 300 మి.మీల వర్షపాతం నమోదవుతుంది. ఏప్రిల్, మే నెలల్లో 250మి.మీల వర్షపాతం నమోదవుతుంది. అయితే ఈ యేడాది ఆశించనంతమేర వర్షాలు కురువలేదు. దీనికి తోడు శనివారం నుంచి అగ్ని నక్షత్రం ఎండలు ప్రారంభమయ్యాయి. ఈ పరిస్థితులలో శుక్రవారం సాయంత్రం నీలగిరి జిల్లా అంతటా అరగంట సేపు చెదురుమదురుగా వర్షం కురిసింది. ఎండవేడిని ఉన్నట్టుండి తగ్గించి, వాతావరణాన్ని చల్లబరచిన ఈ వర్షానికి పర్యాటకులు ఊరట చెందారు. ఊటీలో కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే చర్యలు

● పాఠశాల విద్యాశాఖ హెచ్చరిక

పెరంబూర్, మే 4: వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించే పాఠశాలపై చర్యలు చేపడతామని పాఠశాల విద్యాశాఖ హెచ్చరించింది. రాష్ట్రంలో మార్చి ఆఖరు నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటుండగా, అగ్ని నక్షత్రం శనివారం నుంచి ప్రారంభమైంది. ఈ సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో పాటు వేడిగాలులు వీస్తాయని, అందువల్ల ప్రజలు అవసరమైన పనులకు తప్ప బయటకు రావద్దని ఆరోగ్యశాఖ హెచ్చరిస్తోంది. ఇక, పాఠశాలల్లో వార్షిక పరీక్షలు ముగిసి గత నెల నుంచి సెలవులు ప్రకటించారు. కానీ, కొన్ని ప్రైవేటు పాఠశాలలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖకు ఫిర్యాదులందాయి. ఈ విషయమై పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ అరివళి, ప్రైవేటు పాఠశాలల డైరెక్టర్ సంయుక్తంగా అన్ని పాఠశాలలకు పంపిన ఉత్తర్వుల్లో.. అన్ని పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించిన తరుణంలో, కొన్ని పాఠశాలలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులందాయన్నారు. ఎండలు అధికంగా ఉన్న కారణంగా విద్యార్థుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ప్రత్యేక తరగతులు నిర్వహించరాదని తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ప్రత్యేక తరగతులు నిర్వహించే పాఠశాలలపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా విద్యాధికారులు కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదులపై సత్వరం చర్యలు చేపట్టాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

కంప్యూటర్ టీచర్ల నియామక ప్రకటన నమ్మొద్దు...

కంప్యూటర్ టీచర్లను నియమిస్తున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మొద్దని పాఠశాల విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఐదేళ్ల ఒప్పంద పద్ధతిలో నెలకు రూ.10,000 వేతనంతో కంప్యూటర్ ఉపాధ్యాయుల నియామకాలు చేపడుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మిన పలువురు పాఠశాల విద్యాశాఖను సంప్రదిస్తున్నారు. ఈ విషయమై స్పందించిన పాఠశాల విద్యాశాఖ... కంప్యూటర్ టీచర్ల నియామక ప్రకటన అవాస్తవమని, అలాంటి ప్రకటనలు నమ్మొద్దని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది.





ఇదీ మందు


ఎన్నికల వేళ ఓటర్లందరూ ఆత్మీయులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు తిరుపతిలో పార్టీల నాయకులు. ఎవరినీ,ఏవర్గాన్నీ వదలకుండా మచ్చిక చేసుకుంటున్నారు. కులం కార్డును ఉపయోగించడానికీ వెనకాడ్డంలేదు. ఏ సామాజిక వర్గానికి ఏ ప్రాంతంలో ఎన్ని ఓట్లు ఉన్నాయో ఆరా తీస్తున్నారు. కులపెద్దలను పిలిపించుకుని ఎన్నడూ లేని ప్రేమను ఒలకబోస్తున్నారు. మీటింగులు పెడుతున్నారు. విందు భోజనాలు పెడుతూ ప్రసన్నం చేసుకుంటున్నారు. వరసలూ కలిపి ముచ్చటిస్తున్నారు. ఇదే మంచి అవకాశంగా భావించి కులసంఘ నాయకలు తమ సమస్యలు ఏకరవు పెడుతూ హామీలు పొందుతున్నారు. నాయకులు కూడా సాధ్యాసాధ్యాలు చూడకుండా మాటిచ్చేస్తున్నారు. ఆఖరుకు ఓబీసీలోనూ చేర్పిస్తామని హామీలు గుప్పిస్తున్నారు. సామాజిక వర్గాలకే కాదు వర్గ కులకూ అడిగిందల్లా చేస్తామంటూ నమ్మిస్తున్నారు.

- తిరుపతి(నేరవిభాగం)


ముఖం చాటేస్తున్నారు...

అగ్రనేతలెవరూ ప్రచారానికి రావడంలేదంటూ నగరి నియోజకవర్గ వైసీపీ నాయకులు గొణుక్కుంటున్నారు. ఒకపక్క అసంతృప్తుల బుజ్జగింపులో రోజా బిజీబిజీగా ఉండడం, పార్టీకి చెందిన పెద్దలెవరూ రాకపోవడంతో ఇదెక్కడి పరిస్థితి రా బాబూ అంటూ తెగ బాధపడిపోతున్నారు. నగరి నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు తరఫున ప్రచార సభను మార్చిలోనే నిర్వహించారు. పీసీసీ చీఫ్ షర్మిల కూడా కాంగ్రెస్ పక్షాన పుత్తూరులో సభను నిర్వహించారు. వైసీపీ తరఫున మాత్రం ఇప్పటి వరకు ఆ పార్టీ అగ్రనాయకత్వం నుంచి ఎవరూ ప్రచారపర్వంలో పాల్గొనకపోవడంపై ఆ పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో జగన్ పుత్తూరులో సభ నిర్వహించారు. ఈసారి మాత్రం పూతలపట్టు వచ్చిన జగన్ అక్కడే రోజాను ఆశీర్వదించాలని ప్రకటించి వెళ్లిపోయారు. అసలే నగరిలో రోజాకు పరిస్థితి అంత ఆశాజనకంగా లేదనే ప్రచారం నేపథ్యంలో ప్రత్యేకించి వైసీపీ టాప్ లీడర్ షిప్ దూరంగా ఉండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- పుత్తూరు అర్బన్





జన  కేతనం

ఆదివారం 5 మే 2024

రోజా మేడం.. గుర్తుందా ఇది మీ శాఖే!

జగన్నాటకం
పర్యాటకం

జగనన్న పాలనలో పర్యాటకం పడకేసింది. పైసా విదిల్చని ప్రభుత్వంలో పర్యాటకశాఖకు మంత్రి అయిన రోజా జిల్లా కోసం అంగుళం అభివృద్ధి పనికూడా చేయలేక చేతులెత్తేశారు. ప్రతిపక్షాల మీద నోరేసుకుని విరుచుకుపడిపోవడమే తప్ప, నిధులు ఇవ్వు జగనన్నా అని ఒక్కసారి కూడా అడిగి సాధించుకోలేకపోయారు. తెలుగుదేశం ప్రభుత్వంలో సాధించిన ప్రగతి మినహా తిరుపతి జిల్లాకు చెప్పుకోవడానికి ఒక్కటి కూడా వైసీపీ ప్రభుత్వానికి లేదు. అయినా నిస్సిగ్గుగా మళ్లీ మరో ఛాన్స్ అడుగుతున్నారని జనం ఆశ్చర్యపోతున్నారు. పిచ్చి తుప్పల పాలైన జిల్లా పర్యాటకంపై ఆంధ్రజ్యోతి సచిత్ర కథనం...

- తిరుపతి ..తడ (ఆంధ్రజ్యోతి)



నేలపట్టులో పిచ్చిమొక్కల మధ్య శిథిలావస్థలో ఉన్న రిసార్ట్‌లు

నెరవేరని స్వదేశీ దర్శన్ కలలు!

కేంద్ర స్వదేశీ దర్శన్ కార్యక్రమం కింద 2017లో నేలపట్టులో రూ.5 కోట్లతో రిసార్టు, చిల్డ్రన్స్ పార్కు, పర్యాటకుల విడిది కోసం ఉడ్ హౌస్‌లు కట్టారు. 2019 నాటికి పనులు పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లూ వాటిని ప్రారంభించలేదు. ఇప్పుడు రిసార్టు పిచ్చిమొక్కల నడుమ అడవిని తలపిస్తుండగా ఉడ్ హౌస్ శిథిలావస్థకు చేరుతోంది. బీవీపాలెంలో ని నిర్మాణాల్లో పెండింగ్ పదిశాతం పనులు పూర్తిచేయడానికి వైసీపీ ప్రభుత్వానికి నాలుగున్నరేళ్ళు పట్టింది.

శిథిలావస్థకు తొలి అతిథి భవనం

జిల్లాలోని ఏకైక బీచ్‌గా గుర్తింపు పొందిన వాకాడు మండలం తూపిలిపాలెం బీచ్‌లో పర్యాటకులు విడిది చేసేందుకు 1987లో టీడీపీ ప్రభుత్వం స్వర్ణముఖి అతిథి భవనం నిర్మించింది. ఐదేళ్లుగా పట్టించుకునేవాళ్లు లేక శిథిలావస్థకు చేరుకుంది.



తూపిలిపాలెం బీచ్‌లో శిథిలావస్థకు చేరిన స్వర్ణముఖి టూరిజం గెస్ట్ హౌస్.



నేలపట్టులో నిరుపయోగంగా వున్న పెలికాన్ గెస్ట్ హౌస్‌లు

పెలికాన్ గెస్ట్ హౌస్‌లు ఏమయ్యాయి?

దొరవారిసత్రం మండలం నేలపట్టులో 2001లో చంద్రబాబు ప్రభుత్వం రూ.37 లక్షలతో రెండు పెలికాన్ అతిథి గృహాలను నిర్మించింది. ఐదేళ్ళ పాటు విజయవంతంగా నడిచినా వైసీపీ ప్రభుత్వం ఈ అతిథి గృహాలను ఏమాత్రం పట్టించుకోలేదు.

అతీగతీ లేని టూరిజం స్టార్ హోటల్

2015లో తిరుపతిలో యాత్రికుల కోసం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్మించేందుకు నాటి సీఎం చంద్రబాబు స్టార్ హోటల్ మంజూరు చేశారు. 2016లో రుయా ఆస్పత్రి ఎదురుగా రూ.25 కోట్ల అంచనా వ్యయంతో ఏడంతస్తులు, 103 గదులతో హోటల్ నిర్మాణం పూర్తయినా వైసీపీ ప్రభుత్వం ఫినిషింగ్ పనులు కూడా చేపట్టలేదు.



తిరుపతిలో అసంపూర్తిగా వున్న టూరిజం స్టార్ హోటల్ భవనం.

ఫ్లెమింగో ఫెస్టివల్ ఏమైంది?



దొరవారిసత్రం మండలం నేలపట్టులో పులికాట్ సరస్సు, పక్షుల అభయారణ్యం నేపథ్యంలో నాటి సీఎం చంద్రబాబు 2000లో ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభించారు. ఏటా మూడు రోజుల పాటు జరిగిన పక్షుల పండుగ వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక 2020 నుంచీ ఆగిపోయింది. .

పున్నమి రెస్టారెంటు కథ కంచికి!

నేలపట్టులోనే రూ.98 లక్షలతో పున్నమి రెస్టారెంట్‌ను 2003లో అప్పటి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మూతపడినా 2014లో టీడీపీ ప్రభుత్వం పునరుద్ధరించింది. వైసీపీ ప్రభుత్వంలో మళ్లీ మూతపడింది. తెరిపించేందుకు కనీస ప్రయత్నం జరగలేదు.



నేలపట్టులో నిరుపయోగంగా పున్నమి రెస్టారెంట్



బీవీపాళెం వద్ద నిర్మించిన రిసార్ట్‌లు

రోజా హయాంలో ప్రతిపాదనలకే పరిమితం

2022లో రోజా పర్యాటక శాఖ మంత్రి అయ్యాక రూపొందించిన ప్రతిపాదనలేవీ కార్యరూపం దాల్చలేదు. నవాబ్‌పేట, మొనపాలెం లైట్ హౌస్, తూపిలిపాలెం, శ్రీనివాసపత్రాలలో బీచ్‌ల ఏర్పాటు ప్రతిపాదనలు, నివేదికలు కాగితాలకే పరిమితమయ్యాయి. వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం వద్ద భారీ రిసార్టు, తలకోన, కళ్యాణి డ్యామ్‌ల వద్ద రిసార్టులు, రెస్టారెంట్లు ఏర్పాటు కాలేదు. రాయలచెరువు బోటింగ్‌కు కదలిక లేదు. తిరుచానూరు-పద్మావతీపురంలో మహిళా ప్రాంగణం పక్కన ఐదు ఎకరాలలో భారీ రిసార్టు, బార్, రెస్టారెంట్, పిల్లల వినోద వేదిక ఏర్పాటు ప్రతిపాదనకూ కదలిక లేదు.

ఒబరాయ్ హోటల్ పనులేవీ..

గతేడాది ఆగస్టులో సీఎం జగన్ కడప జిల్లా నుంచీ వర్చువల్‌గా తిరుపతి ఒబరాయ్ హోటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ నిర్మాణ పనులు మొదలు కాలేదు. ఒబరాయ్ హోటల్స్ గ్రూప్‌కు అలిపిరి-చెర్లోపల్లి మార్గంలో 20 ఎకరాలు లీజుపై కేటాయించి తర్వాత పట్టించుకోలేదు.

నిధులు మురిగిపోయినా..

ఇరకం దీవిలో రిసార్టులు నిర్మించి బీవీ పాలెం నుంచీ స్పీడ్ బోట్లలో పర్యాటకులను దీవికి చేర్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించింది. అప్పటి నుంచీ నిధులు మురిగిపోతున్నా పర్యాటక మంత్రిగా రోజా కనీస చొరవ తీసుకోలేదు.

మంత్రి ఇలాకాలో మద్యం షాపు

2003లో టీడీపీ ప్రభుత్వం పుత్తూరులో పున్నమి రెస్టారెంట్ నిర్మించినా కాంగ్రెస్ హయాంలో మూత పడింది. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే రోజా పర్యాటక శాఖ మంత్రిగా ఉన్నా తెరిపించే ప్రయత్నం చేయలేదు. రెస్టారెంటును తెరిపించకపోగా అందులో ప్రభుత్వ మద్యం షాపు నిర్వహిస్తుండడం గమనార్హం.



పుత్తూరులో మూతపడిన టూరిజం రెస్టారెంటులో ప్రభుత్వ మద్యం షాపు నిర్వహణ

శ్రీకాళహస్తి పున్నమికి చీకట్లు


శ్రీకాళహస్తి పట్టణం మిట్ట కండ్రిగలో హరిత రెస్టారెంట్ 2019 వరకూ కళకళలాడింది. వైసీపీ ప్రభుత్వం రావడంతో నిర్వహణ లోపాలతో మూతపడే స్థితికి చేరుకుంది.



శ్రీకాళహస్తిలో మూసివేత దశకు చేరుకున్న టూరిజం రిసార్టు, రెస్టారెంట్


రాయలచెరువులో సాగని బోటు షికార్

2016లో టీడీపీ ప్రభుత్వం రామచంద్రాపురం మండలం రాయలచెరువులో బోటు షికారు ప్రారంభించింది. పది బోట్లు పర్యాటకులతో బిజీగా నడిచేవి. 2018లో నీరు తగ్గడంతో బోటు షికారుకు బ్రేక్ పడింది. 2019లో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇది పూర్తిగా అటకెక్కింది.



పిక్నిక్ స్పాట్‌గా పేరొందిన రాయలచెరువు

చేనేత సిరి..వెంకటగిరి



నియోజకవర్గం చరిత్ర

వెంకటగిరి రూరల్,డక్కిలి, బాలాయపల్లి,సైదాపురం, రాపూరు, కలువాయి, వెంకటగిరి మున్సిపాలిటీ

వెంకటగిరి అనగానే చేనేత, స్వాతంత్రం రాకముందు వెంకటగిరి రాజా పరిపాలన గుర్తుకు వస్తాయి. వెంకటగిరిలో నేటికీ రాజాలు ఈ ప్రాంతాన్ని పాలించిన ఆనవాళ్ళు పురాతన భవన కట్టడాల రూపంలో కనిపిస్తాయి. ఇప్పటికీ ఇక్కడి రాజ వంశీకులు నాటి సాంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. చేనేతకు వెంకటగిరి పెట్టింది పేరు. అగ్గిపెట్టెలో పట్టేంత జరీచీరను నేసిన కళా నైపుణ్య చరిత్ర ఇక్కడి నేత కార్మికుల సొంతం. ఇక్కడ తయారైన చీరలు దేశ విదేశాల్లో ప్రాచుర్యం గడించాయి. రాజకీయల్లో కూడా ఈ నియోజకవర్గం ప్రత్యేక ముద్ర వేసుకుంది. ముఖ్యమంత్రితో పాటు పలు పదవులను అలంకరించిన నేదురుమల్లి జనార్దనరెడ్డి రాజకీయ జీవితం ప్రారంభమైంది ఇక్కడ నుంచే. నాటి ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన సమయంలోనే వెంకటగిరి నియోజకవర్గం ఏర్పడింది. ఈ నియోజకవర్గం ఆవిర్భవించిన 72 ఏళ్లలో ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో ఎనిమిది సార్లు కాంగ్రెస్, ఐదు సార్లు తెలుగుదేశం అభ్యర్థులు, ఇండిపెండెంట్, వైసీపీలు ఒక్కోసారి విజయం సాధించాయి.

- వెంకటగిరి/డక్కిలి

ఎమ్మెల్యేలు

1952	పాదిలేటి వెంకటస్వామిరెడ్డి	కాంగ్రెస్
1955	పాదిలేటి వెంకటస్వామిరెడ్డి	కాంగ్రెస్
1955	కమతం షణ్ముగం (ద్విసభా నియోజకవర్గం)	కాంగ్రెస్
1962	అల్లం కృష్ణయ్య	కాంగ్రెస్
1967	ఓరేపల్లి వెంకటసుబ్బయ్య	ఇండిపెండెంట్
1972	ఓరేపల్లి వెంకటసుబ్బయ్య	కాంగ్రెస్
1978	నల్లపురెడ్డి శ్రీనివాసుల రెడ్డి	కాంగ్రెస్
1983	నల్లపురెడ్డి చంద్రశేకరరెడ్డి	టీడీపీ
1985	వివి సాయికృష్ణయాచేంద్ర	టీడీపీ
1989	నేదురుమల్లి జనార్దనరెడ్డి	కాంగ్రెస్
1994	వివివి రాజగోపాలకృష్ణయాచేంద్ర	టీడీపీ
1999	నేదురుమల్లి రాజ్యలక్ష్మి	కాంగ్రెస్
2004	నేదురుమల్లి రాజ్యలక్ష్మి	కాంగ్రెస్
2009	కురుగొండ్ల రామకృష్ణ	టీడీపీ
2014	కురుగొండ్ల రామకృష్ణ	టీడీపీ
2019	ఆనం రామనారాయణరెడ్డి	వైసీపీ

నియోజకవర్గం ఏర్పడింది : 1952

ఎన్నిసార్లు ఎన్నిక జరిగింది: 15

ఓటర్లు

మొత్తం : 2,39,240
పురుషులు : 1,16,936
మహిళలు : 1,22,300
ఇతరులు : 04

ఆదరణ కోసం ఆ దరువు



సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డప్పు కొడుతూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. తమ పార్టీ అభ్యర్థి మురళిని గెలిపించాలంటూ తిరుపతి లెనిన్ నగర్‌లో శనివారం ఆయన ఎన్నికల శంఖారావం పూరించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసేది తమ పార్టీ ఒక్కటేనని రామకృష్ణ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు.

-తిరుపతి (ఆటోనగర్)